క్లుప్తంగా

98 శాతం పింఛన్ల పంపిణీ

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలో 98.24 శాతం పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశామని ఎంపీడీఓ బి.భార్గవి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 16 వేల 584 మందికి గాను16 వేల 293 మంది లబ్ధిదారులకు రూ.4,53,37,750 పంపిణీ చేశామన్నారు.

రీసర్వే పనుల పరిశీలన



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో రీసర్వే పనులను శనివారం సర్వేశాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ కె.సుబ్బారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నున్న గ్రామంలో దాదాపు 10 వేల ఎకరాల భూములు ఉన్నాయన్నారు. వాటిలో 3 వేల ఎకరాలు అటవీశాఖకు చెందిన భూములని తెలిపారు. రైతులకు చెందిన సుమారు 1200 ఎకరాల్లో రీసర్వే పనులు పూర్తి చేశామని వివరించారు. గ్రామంలో భూములన్నీ పూర్తయ్యేవరకు రీ సర్వే కొనసాగుతుందన్నారు. ముగ్గురు గ్రామ సర్వేయర్లు రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

24 మందికి వైద్య పరీక్షలు



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం గూడవల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం సచివాలయం -1లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కె.సునీత ఆధ్వర్యంలో కీళ్లవాతం, గ్యాస్ట్రబుల్, దగ్గు, జలుబు, చర్మవ్యాధులతో బాధపడుతున్న 24 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నిత్యం యోగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కోటేశ్వరరావు, యోగ టీచర్లు స్వాతి, జగదీశ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు ఆదివారం నిర్వహిస్తున్నట్లు గుణదల విద్యుత్ ఆపరేషన్ ఈఈ పి.హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. కేసరపల్లి, అజ్జంపూడి, బుద్ధవరం, బూతిమిల్లిపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. ఆయా గ్రామాల పరిధిలోని గృహ, పారిశ్రామిక, వ్యవసాయ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సినీ దర్శకుడు విశ్వనాథ్‌కు నివాళి

పెనమలూరు: సినీ దర్శకుడు కె.విశ్వనాథ్‌కు కానూరులో క్రీడాకారులు ఘన నివాళులర్పించారు. శనివారం గ్రామంలో మాతృహృదయ్ స్వచ్ఛంద్ సేవాసంఘ ఆధ్వర్యంలో అశోక్ జిమ్‌లో కె.విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈదా రాజేష్, కార్యదర్శి తాళ్లూరి అశోక్, పి.నాగేశ్వరరావు, చైతన్య యోగా మాస్టారు శ్రీను, క్రీడాకారులు కొండల్, షాజిద్ పలువురు పాల్గొన్నారు.

మేలుజాతి పెయ్యి దూడల ఉత్పత్తికి ప్రణాళిక

హనుమాన్‌జంక్షన్ రూరల్ (గన్నవరం): మేలుజాతి పెయ్యి దూడల ఉత్పత్తి ద్వారా పాడిరైతులకు మెరుగైన ఆదాయం సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని పశుసంవర్థక శాఖ డెప్యూటీ డైరెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. బాపులపాడు మండలం ఎ.సీతారామపురంలోని రైతు భరోసా కేంద్రంలో పాడి రైతులతో పశు విజ్ఞాన బడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పెయ్యి దూడల ఉత్పత్తి పథకం ద్వారా అధిక పాల దిగుబడిని ఇచ్చే మేలుజాతి పశువుల వీర్యం రూ.500లకే గేదెలకు ఇవ్వనున్నట్లు డీడీ శ్రీనివాసులు తెలిపారు. గేదెలకు కేవలం పెయ్యి దూడలు మాత్రమే పుట్టే విధంగా ముందుగానే అన్నిరకాల పరీక్షలు నిర్వహించిన లింగ నిర్ధారణ చేసిన వీర్యాన్ని అందించనున్నట్లు వివరించారు. తద్వారా మేలుజాతి పశువులను అభివృద్ధి చేయటంతో పాటుగా పాడిరైతులకు ఆర్థిక స్వాలంబన సాధించవచ్చని చెప్పారు. అంపాపురం ప్రభుత్వ పశువైద్యశాల అధికారి డాక్టర్ మండాది దుర్గాభవాని, గన్నవరం ఏఎంసీ మాజీ డైరెక్టర్ కోడెబోయిన బాబి, వెటర్నరీ అసిస్టెంట్ అశోక్ పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండగా ప్రభుత్వం



చోడవరంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. చోడవరం గ్రామంలో శనివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ప్రజలకు అమలు చేసిన సంక్షేమ పథకాల బ్రోచర్ లబ్ధిదారులకు అందచేసి, సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజల అవసరాలు తీరి స్థితిగతులు మారాయన్నారు. జగనన్న పాదయాత్రలో వచ్చిన సమస్యలు దృష్టిలో ఉంచుకుని నవరత్నాలు నేడు అమలు చేస్తున్నామని వివరించారు. పేద విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఇవే కాకుండా చేతి వృత్తి పనివారికి, చిరు వ్యాపారులు, అక్కాచెల్లెమ్మలు, రైతులను ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో ఆదుకుంటుందన్నారు. నేడు రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలు చాలా సంతృప్తికరంగా ఉన్నారని ఆయన తెలిపారు.

పేదల కల సాకారం..

రాష్ట్రంలో 30 లక్షల మంది పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించటం వలన వారి జీవిత కల సాకారమయిందని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. చోడవరం గ్రామంలో 200 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించామని తెలిపారు. అయితే చంద్రబాబునాయుడు, అతని మద్దతుగా ఉన్న మీడియాకు పేదల అభివృద్ధి కనబడటంలేదని ఆరోపించారు. చంద్రబాబు తన 14 సంవత్సరాల పాలనలో ఏనాడైనా పేదలకు న్యాయం చేశాడా అని ప్రశ్నించారు. పేదల అభివృద్ధి చంద్రబాబునాయుడు చూడలేక పోతూ కుట్రలు పన్నుతున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కాకర్ల వెంకటరత్నం, వైఎస్సార్ సీపీ నేతలు మండూరు కోటేశ్వరరావు, మానికొండ సూర్యతేజ, బాలకోటేశ్వరరావు, చోడవరపు శ్రీనివాసరావు, రవిచంద్, సింగంపల్లి రమాదేవి, లింగాల సాంబశివరావు, దివి నాగఫణీంద్ర, కాటూరి కోటేశ్వరరావు, లాం రామారావు, శీలం రవిచంద్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ ఇందిరా దేవి



కంకిపాడులో మాట్లాడుతున్న జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ ఇందిరాదేవి

కంకిపాడు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ ఇందిరాదేవి అన్నారు. గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె కంకిపాడులో విస్తృతంగా పర్యటించారు. తొలుత సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి ద్వారా అందుతున్న సేవలు, అందుబాటులో ఉన్న విభాగాల గురించి ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సంజయ్ వివరించారు. నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించగానే ఆసుపత్రి ప్రారంభానికి చర్యలు చేపట్టాల్సి ఉందని తెలిపారు. డాక్టర్ ఇందిరాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వైద్యసేవలను ప్రజలకు చేరువ చేసేలా చర్యలు చేపట్టిందన్నారు. ఆ లక్ష్యానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాధులు దరిచేరకుండా జాగ్రత్తలు వహించాలని ఆదేశించారు. గొడవర్రు గ్రామంలో నిర్మిస్తున్న జగనన్న లే అవుట్లను సందర్శించి ఇళ్ల నిర్మాణ ప్రగతిపై సమీక్షించారు. కంకిపాడు గ్రామస్తులకు కేటాయించిన జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, ఈఓ రామకృష్ణ, సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ దుర్వాసులు, డాక్టర్ మౌనిక, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

గన్నవరం రూరల్: ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీలు ముమ్మరంగా పాల్గొనాలని పథకం ఏపీవో సత్యప్రియ కోరారు. శనివారం మండలంలోని బీబీ గూడెం గ్రామంలో జరుగుతున్న పంట కాలువ తవ్వకం పనులను ఆమె పరిశీలన చేశారు. కాలువ తవ్వకం పనుల్లో 30 మంది కూలీలు పాల్గొనగా మస్టర్లు పరిశీలించి వారితో మాట్లాడారు. ప్రభుత్వం ఉపాధి కూలీలకు రోజుకు రూ.257 ఇస్తుందని చెప్పారు. పంట కాలువల తవ్వకం, చెరువుల్లో పూడికతీత, పంట భూముల్లో నీటి నిల్వ కోసం కందకాలు ఏర్పాటు, రహదారుల వెంట మొక్కల పెంపకం పనులు జరుగుతాయని చెప్పారు. వ్యవసాయ అనుబంధంగా రైతుల అభివృద్ధికి ఉపయోగపడే పనులను గ్రామాల్లో ఇప్పటికే నమోదు చేసి ప్రాధాన్యతా క్రమంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు ఛిద్రం



మాట్లాడుతున్న సీఐ నరసింహమూర్తి

కంకిపాడు: మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలు ఛిద్రం అవుతాయని కంకిపాడు అదనపు ఎస్‌ఐ జే.లక్ష్మి అన్నారు. ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో మాదకద్రవ్యాల వినియోగంపై శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అదనపు ఎస్‌ఐ లక్ష్మి మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలను వినియోగించటం ద్వారా విచక్షణ కోల్పోయే అవకాశం ఉందన్నారు. వినియోగంతో పాటు, అక్రమ రవాణాకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. హెచ్‌ఎం పద్మా, సచివాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హనుమాన్ జంక్షన్ సీఐ నరసింహమూర్తి పేర్కొన్నారు. శనివారం తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో డ్రగ్స్ తీసుకోవడం వలన కలిగే దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి తీసుకోవడం వలన అనేక దుష్పరిణామాలు ఉంటాయిని చెప్పారు. మత్తు పదార్థాలు సేవించిన వారిపై ఎన్‌డీపీస్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆత్కూరు ఎస్‌ఐ సూర్య శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు చోరీ కేసులు నమోదు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోడూరుపాడు, వీరవల్లి గ్రామాల్లో జరిగిన వేర్వేరు చోరీ ఘటనలపై ఎస్‌ఐ యు.ఎల్. సుబ్రహ్మణ్యం శనివారం కేసు నమోదు చేశారు. వీరవల్లికి చెందిన షేక్ హుస్సేన్ అతని భార్య అనారోగ్యం కారణంగా ఇంటికి తాళం వేసి విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఈ నెల 3వ తేదీన ఇంటికి రాగా తాళం పగులకొట్టి ఉంది. ఇంట్లో రూ.75 వేలు విలువ చేసే బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లుగా గుర్తించారు. బాధితుడు షేక్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. కోడూరుపాడుకు చెందిన వేముల రవి, అతని భార్య ఇంటికి తాళం వేసి ఏలూరు ఆస్పత్రికి వెళ్లారు. ఈ నెల 3న ఇంటికి తిరిగి వచ్చి రూ.17 వేలు విలువ చేసే బంగారం, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లుగా గుర్తించారు.ఎస్‌ఐ దర్యాప్తు చేపట్టారు.

8న మందిర వార్షికోత్సవం

కంకిపాడు:మండలంలోనిచలివేంద్రపాలెం గ్రామంలో శ్రీ షిర్డీసాయిబాబా మందిరం వార్షికోత్సవం ఈనెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు శ్రీ సాయిరామ్ తీర్థ సేవా ట్రస్టు నిర్వాహకులు శనివారం వివరాలు వెల్లడించారు. షిర్డీసాయి బాబా మందిరం 17 వ వార్షికోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. 8వ తేదీ ఉదయం 5 గంటల నుంచి హారతి, అన్ని పళ్లరసాలతో అభిషేకం, అష్టోత్తర సహస్ర నామాలతో పూజలు, గీతా పారాయణం నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్న సమారాధన నిర్వహిస్తున్నామ తెలిపారు.

ముగిసిన మండల దీక్ష పారాయణం



లక్ష కుంకుమార్చనలో భక్తులు

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో జరుగుతున్న శ్రీలలితా సహస్రనామ పారాయణం మండల దీక్ష శనివారం ఘనంగా ముగిసింది. ఈ నెల 5న జరగనున్న శ్రీలక్ష్మీతిరుపమ్మ సమేత గోపయ్యస్వామి రజతోత్సవ కల్యాణ మహోత్సవం సందర్భంగా గత 41 రోజులుగా ఈ దీక్ష చేపట్టారు. వేడుకల్లో భాగంగా తొలుత శ్రీలక్ష్మీ తిరుపతమ్మను పెండ్లి కుమార్తెగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో లక్ష కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం లలితా సహస్రనామ పారాయణ మండల దీక్ష ముగింపు సందర్భంగా కలశ ఉద్వాసన పలికారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం శ్రీలక్ష్మీతిరుపతమ్మకు సారెను సమర్పించారు. ఆదివారం రాత్రి 8.40 గంటలకు అమ్మవారి రజతోత్సవ కల్యాణం జరగనుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు పరిసరా గ్రామాల భక్తులు తరలిరావాలని పిలుపునిచ్చారు. విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, మాజీ సర్పంచి గూడవల్లి తులసీమోహన్, పలువురు పుర ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

భక్తిశ్రద్ధలతో వీరభద్రుని ఊరేగింపు

ఉయ్యూరు: శ్రీ జగదాంబ సమేత సోమేశ్వర స్వామి (శివాలయం) ఆలయ వార్షిక కల్యాణంలో భాగంగా శనివారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి వీరభద్రుని పళ్లెం ఊరేగింపు సాగింది. ఆలయం వద్ద ఈ ఊరేగింపును వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులపాటి రామచంద్రరావు, ఆలయ చైర్మన్ సీహెచ్ కుటుంబరాజు, ఈఓ కానూరు సురేష్‌బాబు ప్రారంభించారు. రథాన్ని ముందుకు లాగటంతో కళాకారులు తమ నృత్య ప్రదర్శన, ఆధ్యాత్మిక గీతాలు, విన్యాసాలతో అలరించారు. శివ పార్వతుల నృత్యం వీరభద్రుని నృత్యం, శూలాలు నోటిలో గుచ్చుకుని కళాకారులు చేసిన ప్రదర్శనను ప్రజలు తిలకించారు.

నేడు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

రూ.23.40 కోట్లతో రోడ్డు నిర్మాణం

హనుమాన్‌జంక్షన్ రూరల్: కృష్ణా, ఏలూరు జిల్లాలోని ఆరు ప్రధాన గ్రామాలను కలుపుతూ16వ నంబర్ జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ రూ.23.40 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన ఆర్ అండ్ బీ రోడ్డుకు గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆదివారం శంకుస్థాపన చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు తెలిపారు. వేలేరులోని గ్రంథాలయం వద్ద ఉదయం 10 గంటలకు భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని ఎమ్మెల్యే వంశీమోహన్ ఆవిష్కరిస్తారు. 16వ నంబర్ జాతీయ రహదారిపై బాపులపాడు మండలం వీరవల్లిలోని కోమటిగుంట రోడ్డు నుంచి మొదలై వేలేరు, మర్రిబంధం సెంటర్, సీతారామపురం, పల్లెర్లమూడి, కొయ్యూరు గ్రామాల మీదగా వెళ్లి బొమ్ములూరు వద్ద మళ్లీ నేషనల్ హైవేను ఈ ఆర్ అండ్ బీ రోడ్డు కలుస్తుంది. సుమారు 9 కిలోమీటర్లు మేర 23 అడుగుల వెడల్పుతో ఈ రోడ్డును అభివృద్ధి చేస్తారు. దీర్ఘకాలంగా ఆయా గ్రామస్తులు ఎదురుచూస్తున్న ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీమోహన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



కానూరులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

పెనమలూరు: ప్రతి ఒక్కరికీ క్యాన్సర్‌పై అవగాహన ఉండాలని వీఆర్ సిద్దార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర పేర్కొన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో కాలేజీ నుంచి కానూరు వంద అడుగుల రోడ్డు వరకు విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించగలిగితే సమస్య నుంచి అధిగమించవచ్చని వివరించారు. ప్రతి ఒక్కరూ ఆహార నియమాలు పాటిస్తూ వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు.

కళ్లకు కూడా క్యాన్సర్ రావచ్చు..

కళ్లకు కూడా క్యాన్సర్ రావచ్చని ఎల్‌వీప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వైద్యులు గంగూలీ కపూర్ అన్నారు. ప్రంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మాట్లాడారు. కళ్లో మార్పులను వెంటనే గుర్తించాలన్నారు. క్రమబద్ధంగా కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు.

గన్నవరం: క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ఉండాలని ఒమేగా హాస్పటల్‌కు చెందిన డాక్టర్ గీతారుక్మిణి సూచించారు. మండలంలోని కేసరపల్లి శివారులోని వీకేఆర్ కళాశాలలో వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రుక్మిణి మాట్లాడుతూ జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఐరన్ అధికంగా ఉండే మునగాకు, ఖర్జూర, ఎండు ద్రాక్ష తినాలని సూచించారు. వాసవ్య మహిళా మండలి ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కంటివెలుగుతో దృష్టిలోపాల నివారణ



కంకిపాడు: కంటి వెలుగు కార్యక్రమంలో దృష్టి లోపాల నివారణ సాధ్యమవుతుందని కోలవెన్ను సర్పంచ్ సీహెచ్ సురేష్‌కుమార్, ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కోలవెన్నులో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం శనివారం నిర్వహించారు. సచివాలయంలో 90 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. నడవలేని స్థితిలో ఉన్న అవ్వాతాతల జాబితాను సేకరించి వారి ఇళ్లకు వెళ్లి కంటి పరీక్షలు చేశారు. దృష్టి లోపాలు ఉన్న వృద్ధులకు కళ్లజోళ్లు, మందులు అందించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది సరళ, లక్ష్మి, పద్మ, ఆశ కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీరమ్మతల్లి తిరునాళ్ల

ఉయ్యూరు: వీరమ్మతల్లి తిరునాళ్ల ఉత్సవాలు శనివారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఆలయంలో కొలువుదీరిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. శనివారం వేకువజాము నుంచే అమ్మకు పాల పొంగళ్లు నిర్వహించి నైవేద్యం సమర్పించి భక్తిపారవశ్యం చెందారు. ఆదివారం తిరునాళ్లకు వేలాదిగా భక్తులు రానుండటంతో ఆలయ కమిటీ, అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా బారికేడ్లు, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు.

ఘనంగా అంకమ్మ తల్లి గ్రామోత్సవం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బిళ్లనపల్లిలోని జరుగుతున్న అంకమ్మ తల్లి తిరునాళ్లలో భాగంగా శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారుజామున ప్రత్యేక పూజలు, అర్చనలు వైభవంగా చేశారు. అనంతరం అంకమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. గ్రామంలో ప్రతి ఇంటి వద్ద మహిళలు అమ్మవారి ఊరేగింపునకు స్వాగతం పలికి, ఆశీస్సులు పొందారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండపావులూరి వెంకట బాబురావు, సభ్యులు మోహన్ కుమార్, హేమంత్ కుమార్, తులసీ రాంప్రసాద్ పాల్గొన్నారు.

వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి



ఉంగుటూరు: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్, కారు డ్రైవర్లు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్‌ఐ జి.రాజు సూచించారు. మానికొండలో రోడ్డు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కలిగే అనర్థాలు, ప్రమాదాలు వివరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. సహాయం చేసిన వ్యక్తిని ఆసుపత్రి సిబ్బందిగాని పోలీసులు ఎవరూ ఇబ్బంది పెట్టరని చెప్పారు. ట్రాఫిక్ రూల్స్ సక్రమంగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పోలీసులు హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు.

రేడియాలజీ విభాగాధిపతికి ఉద్యోగోన్నతి



గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో శస్త్ర చికిత్స, రేడియాలజీ విభాగాధిపతిగా పనిచేస్తున్న ఆచార్య డాక్టర్ మక్కిన శ్రీనుకు ఉద్యోగోన్నతి లభించింది. ఆయనను విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం గరివిడిలోని పశువైద్య కళాశాలకు అసోసియేట్ డీన్‌గా నియమిస్తూ శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కళాశాలకు చెందిన క్లినికల్ కాంప్లెక్స్‌లో సుదీర్ఘ కాలం పాటు శస్త్ర చికిత్స, రేడియాలజీ విభాగాధిపతిగా ఆయన విశేష సేవలందించారు. ఉద్యోగోన్నతి పొందిన డాక్టర్ మక్కిన శ్రీనుకు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బీ.శ్రీదేవి, పలువురు విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి

డీఆర్‌డీఓ శాస్త్రవేత్త శ్రీనివాసరావు



గంగూరులో ధనుష్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

పెనమలూరు: విద్యార్థులు నూతన ఆవిష్కరణల పై దృష్టి పెట్టాలని డీఆర్‌డీఓ శాస్త్రవేత్త డాక్టర్ వై.శ్రీనివాసరావు సూచించారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ధనుష్ 2కే 23 కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులను విద్యార్థులు గుర్తించాలని సూచించారు. విద్యార్థులు నిరంతరం నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 30 కాలేజీల నుంచి విద్యార్థులు హాజరై టెక్నికల్ పేపర్ ప్రెజెంటేషన్ చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, డైరెక్టర్ రవిప్రసాద్, డీన్ ఆర్. సత్యప్రసాద్, కోఆర్డినేటర్ గోగినేని రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సొంత మార్కెటింగ్‌పై దృష్టి సారించాలి

ఉయ్యూరు: రైతులు సొంత మార్కెటింగ్ పద్ధతులు అనుసరించాలని రైతు సాధికార సంస్థ సీఈఓ బి.రామారావు సూచించారు. ప్రకృతి వ్యవసాయ విధానం అన్నింటా మేలని పేర్కొన్నారు. ఉయ్యూరు మండలం గండిగుంటలోని పాలడుగు శివనాగేశ్వరరావు ఐదు లేయర్ల మోడల్, నిడమానూరులోని ఐనంపూడి ప్రభాకర్ వ్యవసాయ క్షేత్రాలను శనివారం సందర్శించారు. ఆయా వ్యవసాయ క్షేత్రాల్లో పండుతున్న పంటలు, దిగుబడులు, పెట్టుబడి వ్యయం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను రైతులు స్వయంగా మార్కెటింగ్ చేసుకునే పరిస్థితులు, కలిగే లాభాలపై అవగాహన పెంచాలన్నారు. జిల్లా ప్రాజెక్టు అధికారి కె.పార్థసారథి, అదనపు డీపీఎం కె.నాగమల్లేశ్వరి, వ్యవసాయాధికారి శివప్రసాద్, గన్నవరం, పమిడిముక్కల, ఉయ్యూరు, పెనమలూరు మండలాల రైతు సాధికారసంస్థ సిబ్బంది పాల్గొన్నారు.